## క్లుప్తంగా

### అధ్వానంగా రోడ్లు



గుంతలమయంగా మారిన రోడ్డు

జైనథ్: మండల కేంద్రంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలుగా మారడంతో చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలుస్తోంది. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గ్రామంలో మిషన్ భగీరథ పనులు చేపట్టడంతో అంతర్గత రోడ్లు ధ్వంసమై గుంతలమయంగా మారాయి. వాటికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### మంత్రి 'తుమ్మల'ను కలిసిన డీసీసీబీ చైర్మన్



మంత్రిని సన్మానిస్తున్న భోజారెడ్డి

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. జిల్లాలోని రైతులకు రావాల్సిన రైతుభరోసా, రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### గుట్ట ప్రవీణ్ మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణానికి చెందిన సివిల్ కాంట్రాక్టర్ గుట్ట ప్రవీణ్ ఇటీవల మృతిచెందగా ఆదివారం పెద్దకర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి జోగు రామన్న హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గుట్ట ప్రవీణ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట యాసం నర్సింగ్‌రావు, దాసరి రమేశ్, కృష్ణ, సతీశ్, రాజు, సంతోష్ తదితరులు ఉన్నారు.

### మానవత్వం చాటుకున్న ఎస్సై

నేరడిగొండ: నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్ మానవత్వం చాటుకున్నారు. మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన కొట్టల మోహన్‌కు ఆదివారం గుర్తు తెలియని వాహనం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. ఘటన స్థలంలో జనం గుమిగూడడంతో అక్కడికి చేరుకున్న ఎస్సై క్షతగాత్రుడిని తన వాహనంలో ఎక్కించి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి

ఇచ్చోడ: మండలంలోని తలమద్రి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పాముల సోమన్న అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు షాదుల్లా, అక్కెపెల్లి లక్ష్మణ్, మనేశ్వర్ నారాయణలు తలమద్రిలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### విద్యుత్ షాక్‌తో రెండు ఆవులు మృతి



మృతి చెందిన ఆవులు

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన సిందేకర్ వంశీకృష్ణకు చెందిన రెండు ఆవులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధిత రైతు వంశీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుచులాపూర్ గ్రామ శివారులో గల చేనులో ఆవులు మేత మేస్తున్నాయి. దగ్గరలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆవులు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

# సీహెచ్‌సీగా మార్చేదెప్పుడో..!

- అర్హతలు ఉన్నా పడని అడుగులు
- అత్యవసర పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు
- సీహెచ్‌సీగా మార్చాలని డిమాండ్

**ఆరోగ్య కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు..**

| సంవత్సరం | సహజప్రసవాలు | ఓపీ రోగులు |
|---|---|---|
| 2023 | 310 | 39,892 |
| 2024 | 201 | 38,089 |
| 2025 | (మే 17 వరకు) | 4722,029 |

ఇచ్చోడ: మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సర్కారు వైద్యం అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వార వైద్య సేవలు అందుతున్నా మెరుగైన చికిత్స కోసం అత్యవసర పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఒక్కోసారి వైద్యం అందించడంలో జాప్యం జరిగి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఈక్రమంలో మండల కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలని చాలా రోజుల నుంచి డిమాండ్ ఉంది.

**మూడు మండలాలకు..**

ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేస్తే ఇచ్చోడ, సిరికొండ, బజార్‌హత్నూర్ మండలాల్లోని మారుమూల గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందుతాయి. నియోజకవర్గానికి మధ్యలో ఉన్న మండల కేంద్రంలో చుట్టుపక్కల ఐదు మండలాల ప్రజలు స్థానికంగా స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. దాదాపుగా 40వేల మంది జనాభా ఇక్కడ నివసిస్తున్నారు. బజార్‌హత్నూర్, సిరికొండ మండలాలవాసులు ప్రతీ చిన్న పనికి ఇచ్చోడకు వస్తుంటారు. ఇక్కడి ప్రజలకు అత్యవసరంగా వైద్య సేవలు అందించాలంటే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న రి మ్స్‌కు వెళ్లాల్సి ఉంటుంది. ఇచ్చోడ, బజార్‌హత్నూర్‌తో పాటు సిరికొండ మండలాల్లో ఉన్న మారుమూల గ్రామాల ప్రజలకు రిమ్స్‌కు వెళ్లాలంటే దూ రభారం తప్పడం లేదు. దీంతో అత్యవసర సమయంలో అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని రిమ్స్‌కు వెళ్లేవరకు కొంతమంది మధ్యలోనే మృత్యువాత పడుతున్నారు.



ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

**సీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి**



అన్ని మండలాల ప్రజలకు మధ్యలో ఉన్న ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలి. దీంతో ఎన్నో మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందుతాయి.

– కొడప నగేశ్, తుడుందెబ్బ నాయకుడు

**అప్‌గ్రేడ్ చేయాలి..**



పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. ఇచ్చోడ పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేసే విధంగా దృష్టి సారించాలి.

– నిమ్మల శివకుమార్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ

**రాజకీయాలకు అతీతంగా..**



ఇచ్చోడలో సీహెచ్‌సీ సాధించేందుకు రాజకీయాలకు అతీతంగా నాయకులు ముందుకు రావాలి. సీహెచ్‌సీ సాధన కమిటీ ఏర్పాటు చేసి మంత్రులకు, ముఖ్య నాయకులకు వినతిపత్రాలు అందజేయాలి.

– పిల్లి నరేశ్, సామాజిక కార్యకర్త

**ఒత్తిడి తేవాలి..**



మండల కేంద్రంలో సీహెచ్‌సీని సాధించేందుకు అందరూ కలిసి పోరాడాలి. రాజకీయ పార్టీల నాయకులు ముందుకొచ్చి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కను కలిసి సీహెచ్‌సీ ఏర్పాటుపై ఒత్తిడి తీసుకురావాలి. – పెరమండ్ల స్వామి, సామాజిక కార్యకర్త

## ఘనంగా అపూర్వ సమ్మేళనం



బేల: మండలంలోని సాంగిడి గ్రామంలోని మోతిజీ మహరాజ్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002 –03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జితేందర్, రాకేశ్, సాగర్, రమేశ్, సునీల్, ప్రమోద్, నితిన్, విఠల్, వాణి, రజిత, కల్పన, విజయలక్ష్మీ, ప్రవీణ, పూర్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాంసి: తలమడుగు మండలంలోని సుంకిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 2005 –06 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో చిన్ననాటి స్నేహితులు కలుసుకుని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయులు ఆనంద్, మహేందర్, వినోద్ రెడ్డి, పూర్వ విద్యార్థులు హరీశ్ రెడ్డి, జైపాల్, కార్తీక్, నితీశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# వేతనాలు లేక 'ఔట్‌సోర్సింగ్' వెతలు

- నాలుగు నెలలుగా అందని జీతాలు
- అవస్థలు పడుతున్న ఉద్యోగులు

ఉట్నూర్‌రూరల్: వైద్యఆరోగ్య శాఖలో ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబపోషణ భారంగా మారినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు లేక కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని దుస్థితి నెలకొంది. ఏ ఉద్యోగి అయినా మరణిస్తే ఈపీఎఫ్, ఈఎస్ఐ నుంచి వచ్చే లాభాలు కూడా రాకుండా చేస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు అటు ప్రభుత్వం కాని ఏజెన్సీ కాని వేతనాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ కట్టకుండా చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 5వ తేది నుంచి మూడు రోజుల పాటు నల్లబ్యాడీలు ధరించి నిరసన వ్యక్తం చేసినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదంటున్నారు.



ఉట్నూర్ ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు (ఫైల్)

**ప్రభుత్వం దృష్టి సారించాలి**



నాలుగు నెలలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్నాం. నిత్యవసరాలు, ఇతర ఖర్చులు పెరుగుతుండగా సమయానికి వేతనాలు లేక కుటుంబ పోషణ భారంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే నాలుగు నెలల పెండింగ్ జీతాలు విడుదల చేసి కుటుంబాలను ఆదుకోవాలి. వెంటనే ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. – బొంకంటి సుభాశ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

## అమ్మ ఆదర్శం.. నాసిరకానికి నిదర్శనం

ఇంద్రవెల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులు నాసిరకంగా దర్శనమిస్తున్నాయి. మండలంలో మొత్తం 90 ప్రభుత్వ పాఠశాలల్లో పనులు చేపట్టి రూ.50 వేల నుంచి రూ.లక్షా50 వేల చొప్పున నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో తాగునీరు, భవనాలకు రంగులు, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్‌లు వంటివి ఏర్పాటు చేశారు. కానీ పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో పనులు జరిగిన మూడు నెలలకే భవనాలు పెచ్చులు ఊడిపోవడం, టైల్స్ పగిలిపోవడం, నల్లాలు విరిగిపోవడం వంటివి జరుగుతున్నాయి. కాగా కొన్ని పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తి కాకుండానే బిల్లులు మంజూరు చేయించారని, ఆ బిల్లుల కోసం పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. కొన్ని పాఠశాలలకు బిల్లులు మంజూరు కావడంతో హడావిడిగా రంగులు వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పనులను పర్యవేక్షించి నాణ్యతగా పనులు జరిగేలా చూడాలని మండలవాసులుకోరుతున్నారు.

– ఇంద్రవెల్లి



పాలుండిగూడలో అసంపూర్తిగా పనులు



పాలుండిగూడలో మూడు నెలలకే విరిగిపోయిన నల్లాలు



సమాక పాఠశాలలో ఊడిపోయిన టైల్స్

# అధ్వానంగా రోడ్లు..!



ఘాట్‌రోడ్డు మూలమలుపు వద్ద కనిపించని ప్రమాద హెచ్చరిక బోర్డు

- గుంతల రహదారులతో ప్రమాదాలు
- మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు కరువు

నార్నూర్: జిల్లాలో నిత్యకృత్యంగా మారిన రోడ్డు ప్రమాదాలు హడలెత్తిస్తున్నాయి. వాహనదారుల అతివేగానికి తోడు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అధ్వానంగా మారిన రహదారులు నరకంగా మారుతున్నాయి. ప్రతీరోజు పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనంతో రోడ్డు మీదకు రావాలంటేనే ప్రజలు ఆలోచించే పరిస్థితి ఏర్పడింది. ఏజెన్సీ ప్రాంతంలో ఏ గిరి గ్రామాలకు వెళ్లాలన్న రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్డు రవాణా సౌకర్యాలు సరిగా లేకపోవడంతో గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, రోడ్లు నిర్మించాలని ఎన్నికల సమయంలో ఆదివాసీ గిరిజనులు కోరుతూనే ఉన్నారు. కానీ కనీస రోడ్డు సౌకర్యాలు మెరుగుపర్చడానికి చర్యలు తీసుకోకపోగా అటవీశాఖ నిబంధనలు ఉన్నాయంటూ పనులు నిలిపివేస్తున్నారు. దీంతో ఇరుకైన రోడ్లపై వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.



కెరమెరి మండలంలోని పరందోలి జంగుబాయి పుణ్యక్షేత్రానికి వెళ్లే సింగిల్ రోడ్డు

**హెచ్చరిక బోర్డులు కరువు..**

నార్నూర్ మండలంలోని మాలేపూర్, గాదిగూడ మండలంలోని ఖడ్కి, డాబా, మారెగాం ప్రధాన రోడ్లతో పాటు ఘాట్ రోడ్లపై మూలమలుపుల వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఘాట్ మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి ఉంది. దీంతో వాహన చోదకులు తమ ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ ప్రమాదానికి కారణమవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఘాట్ రోడ్లపై మూలమలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

## బోరుబావిని ధ్వంసం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని సాలెగూడ గ్రామంలోని బోరుబావిని ధ్వంసం చేసి అందులో బండరాళ్లు, మట్టివేసి పూడ్చివేసిన అటవీ శాఖ అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం పూడ్చేసిన బోరుబావిని వారు పరిశీలించారు. తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ మాట్లాడుతూ సాలెగూడ గ్రామ ఆదివాసీల తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం బోరుబావిని మంజూరు చేసిందన్నారు. 15 రోజులుగా ఆదివాసీలు పెర్సపెన్ కార్యక్రమంలో ఉండగా అటవీశాఖ అధికారులు బోరుబావుని బండరాళ్లు వేసి ధ్వంసం చేసి మూసి వేయడం సరికాదన్నారు. అక్కడ వేసిన బోరు అటవీ ప్రాంతంలోకి రాదన్నారు. అధికారులు ప్రత్యేకమైన బోరుబావి వేసి వారికి నల్లాల ద్వారా నీళ్లు అందే చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సలాం వరుణ్, డివిజన్ ఉపాధ్యక్షుడు ఆత్రం గణపతి, మండల అధ్యక్షుడు మెస్రం కేశవ్, నాయకులు మర్సుకోల భరత్, ఉయికే దినేశ్, పుస్నక్ రమేశ్, కుడ్మేత జంగు, సుంగు తదితరులు ఉన్నారు.



అటవీశాఖ అధికారులు పూడ్చేసిన బోరుబావిని పరిశీలిస్తున్న నాయకులు

## గ్రామదేవతలకు గంగపుత్రుల పూజలు

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో గంగపుత్రులు ఆదివారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా నిర్వహించే పూజలలో భాగంగా మత్స్యకారులు సంప్రదాయ పద్ధతిలో గ్రామదేవతలకు పూజలు చేపట్టారు. గ్రామంలో చేపలు పట్టే వలలతో ఊరేగింపుగా వెళ్లి పోచ్చమ్మ, సార్గమ్మ, మంద పోచ్చమ్మ తల్లి విగ్రహాలకు నీటితో అభిషేకం నిర్వహించారు. అనంతరం పూజలను నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఏటా వర్షాకాలానికి ముందు పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామస్తులు ఆరోగ్యంగా ఉండాలని పూజలు చేస్తున్నామన్నారు. గంగపుత్ర సంఘం సభ్యులు రాజన్న, సంతోష్, రాజు, దత్తు తదితరులు ఉన్నారు.



ఊరేగింపుగా వెళ్తున్న గంగపుత్రులు

## క్రీడలు ప్రతిభను వెలికి తీస్తాయి

బోథ్: క్రీడలు గ్రామీణ ప్రాంతాల్లోని యువకుల ప్రతిభను వెలికితీస్తాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సొనాల మండల కేంద్రంలో గత కొన్నిరోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్‌తో పాటు సొసైటీ సభ్యులను అభినందించారు. అనంతరం క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



క్రీడాకారులతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### అంబలి పంపిణీకి విశేష స్పందన

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చేపట్టిన ఉచిత అంబలి పంపిణీకి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేసే పల్లికొండ జనార్దన్ గత పదేళ్లగా తన సొంత డబ్బులతో ప్రతీ వేసవిలో అంబలి పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో అంబలితో పాటు చల్లని తాగునీటి ఫ్రీజర్‌ను ఏర్పాటుచేసి అందరి మన్ననలు పొందుతున్నాడు. ఎలాంటి ప్రచార ఆర్భాటం లేకుండా రాజకీయాలకు అతీతంగా సామాజిక సేవ చేస్తూ మార్గదర్శిగా నిలుస్తున్నాడు.